క్లుప్తంగా

నేటి నుంచి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

ఆత్మకూరు : స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు నేటి (బుధవారం) నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి మంగళవారం తెలిపారు. బుధవారం సాయంత్రం తొల్లక్కం, అధ్యయనోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని వేద పండితులచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని అర్చకులు కోరారు.

ముస్త్యాలపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం

దామెర : మండలంలోని ముస్త్యాలపల్లిలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న యాగశాల, గ్రామానికి తోరణ బంధము, ప్రధాన కలశస్థాపన, గణపతి హోమం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8న గురువారం హోమములు, మంత్రపుష్పం, విగ్రహాల ఊరేగింపు, కుంకుమార్చన, లక్ష్మీపూజ, ధాన్యాదివాసం, పుష్పాదివాసం, ఫలాదివాసం, శయ్యాదివాసం, యాగశాల అష్ట దిగ్బంధం కార్యక్రమలు నిర్వహిస్తారు. 9న శుక్రవారం భూలక్ష్మి, పోచమ్మ, పోతరాజులకు ప్రతిష్ఠాపన మంత్రపూజ, పునఃపూజలు, వాస్తు పూజ, ఊరిచుట్టూ పులగం బలిపోయటం కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. గ్రామస్తులు హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పెద్దాపూర్ శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. దుగ్గొండి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన తిప్పారపు హరీష్ బైక్‌పై లక్ష్మీపురం నుంచి వరంగల్ కు వెళ్తుండగా పెద్దాపురం శివారులోని మలుపు వద్ద బైకును ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 సాయంతో నగరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం బాధితుడి తమ్ముడు ముఖేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా కుమార్



ధర్మసాగర్: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా మండలంలోని మల్లక్‌పల్లి గ్రామానికి చెందిన బైరపాక కుమార్‌ను నియమించినట్లు ఆ పార్టీ జనగాం జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ తన పై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా నియమించిన జిల్లా అధ్యక్షుడు రమేష్, సహకరించిన జిల్లా, మండల, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు

దామెర : అక్రమంగా మొరం తరలిస్తుండగా రెండు వేర్వేరు ఘటనల్లో వాహనాలు స్వాధీనం చేసుకున్న ఘటన స్థానిక పోలీస్ స్టేషన్‌పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండలంలోని కోగిల్వాయి గ్రామం సమీపం నుంచి హనుమకొండకు టిప్పర్‌లో మొరం తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని డ్రైవర్ గోల్కొండ అజయ్‌పై కేసు నమోదుచేసి టిప్పర్‌ను సీజ్ చేశారు. అదే విధంగా పసరగొండ సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు చేపడుతున్న విషయం తెలుసుకుని పోలీసులు దాడి చేయగా జేసీబీని పట్టుకొని డ్రైవర్ మేడిపల్లి రాజుపై కేసు నమోదు చేసి జేసీబీని సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా మొరం, మట్టి తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రజక సంఘం పొలిట్ బ్యూరో సభ్యుడిగా రమేశ్



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం ప్రాంతానికి చెందిన గట్టికొప్పుల రమేశ్‌ను రజక సంక్షేమ సంఘం (ఆర్ఎస్ఎస్) రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడిగా నియమించారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేరాల ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. రమేశ్ గతంలో సంఘం జిల్లా డైరెక్టర్‌గా పని చేశారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షులు ముప్పు భిక్షపతి, చేరాల ప్రకాశ్‌కు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

పచ్చదనాన్ని తగలబెట్టేస్తున్నారు

- రోడ్ల వెంట మక్కజొన్న కంకుల పొట్టును, బెండ్లను పడేస్తున్న రైతులు
- పట్టింపులేని అధికారులు



అవెన్యూ ప్లాంటేషన్ మొక్కల మొదల్లో పోసిన కంకుల బెండ్లు



కంకి బెండ్లను తగలబెట్టడంతో దగ్ధమైన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు

శాయంపేట : మండలంలోని ఆరెపల్లి గ్రామ శివారులో రైతులు కంకులు ఆరబోసి కంకులను మిషన్‌లో వేసి జొన్నలు పట్టిన తర్వాత కంకుల కంకిపొట్టును, బెండ్లను రోడ్డు ప్రక్కన పడేయగా గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారు. ఆ మంటల్లో గత ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలు దగ్ధమయ్యాయి. రైతులు తాము పండించిన మక్కజొన్న కంకులను రోడ్డుపై ఆరపోసి అక్కడే మిషన్ పట్టించి మక్కలను ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. కంకి బెండ్లను, పొట్టును రోడ్డు ప్రక్కన అవెన్యూ ప్లాంటేషన్ చెట్ల మొదల్లో పడవేయడంతో గుర్తుతెలియని వ్యక్తులు కంకి బెండ్లను కాల్చి వేయడంతో నిప్పంటుకొని ఆ మంటల్లో ఉపాధి హామీ పథకంలో నాటిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు కాలిపోయాయి. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చి నాటినే అవెన్యూ ప్లాంటేషన్ చెట్లు తగలబడడమే కాకుండా పర్యావరణం దెబ్బతింటుంది.

ప్రతి ఏడాది ఇదే తంతు

కొన్నేళ్లుగా కంకి బెండ్లను చెట్ల మొదల్లో వేయడం, తగలబెట్టడం షరా మామూలైంది. 'సాక్షి'లో గతంలో కూడా కథనాలు వచ్చినప్పటికీ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా మండల, జిల్లా అధికారులు స్పందించి అవెన్యూ ప్లాంటేషన్ చెట్లను కాల్చకుండా చూడాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

- వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ వెంకటరెడ్డి

వేలేరు : రైతులు వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎ.వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని శాలపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో సాగు ఖర్చులు, యూరియా వాడకం తగ్గించడం, నీటి వినియోగం, పంటల మార్పిడి వలన కలిగే ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వ్యవసాయ కళాశాల సూక్ష్మజీవ శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.మానస మాట్లాడుతూ వ్యవసాయంలో జీవన ఎరువుల ప్రాముఖ్యత వాటిని వాడటంతో కలిగే ప్రయోజనాలు రైతులకు వివరించారు. ఏఓ కవిత మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా చేపట్టే భూసార పరీక్ష సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు రాజశేఖర్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మారెపల్లి నాగరాజు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 2005–06 సంవత్సరంలో తనతో పాటు పదో తరగతి చదువుకున్న చిన్ననాటి స్నేహితులు చేయూతనిచ్చారు. రూ. 30వేలు జమ చేసి నాగరాజు కూతుర్ల పేరు మీద పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఔదార్యం చాటుకున్నారు. మంగళవారం స్నేహితులు నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అందజేసిన వారిలో నాని, నాగరాజు, మధుకర్, సుమన్, సందీప్, క్రాంతి, చంద్రశేఖర్, సూర్యప్రకాష్, బాలకృష్ణ, విజయ్, నరేష్, నగేష్, భిక్షపతి, ప్రదీప్, వివేక్ తదితరులు ఉన్నారు.

పాకిస్తాన్ వలసదారులు ఉంటే చర్య తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వేలేరు : జమ్ము కశ్మీర్‌లో జరుగుతున్న అల్లర్ల దృష్ట్యా మండలంలో ఎవరైన పాకిస్తాన్ వలసదారులు ఉంటే వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు కాట్రేవుల రాజు ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ హెచ్.కోమికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. మండలంలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగినట్లెతే వారి ఆధార్, రేషన్ కార్డులను పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేష్, కిరణ్, కనుకాచారి, కోటి, శివాజీ, రాము, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

9న మహారాణా ప్రతాప్‌సింగ్ జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న రణబీర్ సింగ్

నయీంనగర్: దేశభక్తుడు, త్యాగశీలి మహారాణా ప్రతాప్‌సింగ్ జయంతి ఉత్సవాలను ఈనెల 9న బొందిలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పద్మాక్షి దేవాలయం రోడ్డు రాధాస్వామి దేవాలయం వద్ద నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు రణబీర్ సింగ్, ప్రధాన కార్యదర్శి మోతీసింగ్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పతాకావిష్కరణ నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం రాధాస్వామి దేవాలయం నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు బైక్ ర్యాలీ ఉంటుందని, ఉమ్మడి వరంగల్ జిల్లా రాజ్‌పుత్ పరివార్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఉత్సవ కమిటీ చైర్మన్ నరేష్‌కుమార్ సింగ్, రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు



ఎల్లమ్మ బోనాలతో వెళ్తున్న గౌడ కులస్తులు

కమలాపూర్ : రేణుకా ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా కమలాపూర్‌లో గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాల వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గీత కార్మిక కుటుంబాలు ఇంటికో బోనం చొప్పున బోనాలు ఎత్తుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా దేవాలయానికి బయలుదేరారు. అక్కడ ఎల్లమ్మ తల్లికి బోనాల నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పబ్బు ఎల్లాగౌడ్, ఉపాధ్యక్షుడు జక్కు ప్రభాకర్, కోశాధికారి పచ్చిమట్ల రాజేశ్‌బాబు, డైరెక్టర్లు కూనూరు సమ్మయ్య, పెరుమాండ్ల భూపాల్, బాలసాని రవి, మండ రాజు, పబ్బు సది, జేరుపోతుల పుల్లయ్య, కారోబార్ పబ్బు కుమారస్వామి, గౌడ మహిళలు, గౌడ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సేఫ్టీకి ప్రాధాన్యం ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్



కాజీపేట రైలు ఇంజన్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

కాజీపేట రూరల్: రైల్వే సేఫ్టీకి ప్రాధాన్యం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట ఉన్న రైలు ఇంజన్ వద్ద సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇటీవల వరుసగా రైలు ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. ఇందులో ప్రాణ నష్టం, రైల్వే ఆస్తి నష్టం జరుగుతున్నప్పటికీ కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైలు ప్రమాదాలకు కేంద్ర ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించకుండా రైల్వే ఉద్యోగులను బాధ్యులను చేయడం సరికాదన్నారు. రైల్వేలో ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, రైల్వే విస్తరణ, భద్రత కోసం అవసరమైన నిధులు కేటాయించాలని, ఎక్స్‌ప్రెస్ బోగీల్లో జనరల్ బోగీలను పెంచాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి, నాయకులు కారు ఉపేందర్, ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, కోటి పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



ఎన్పీడీసీఎల్ స్టోర్స్ ఏడీఈ కుమారస్వామికి సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

హన్మకొండ: ఈనెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్పీడీసీఎల్ శాఖ గౌరవాధ్యక్షుడు జి.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ స్టోర్ ఏడీఈ కుమారస్వామికి సమ్మె నోటీసును మంగళవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్పీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కత్తెర్ల నాగేశ్వరరావు, జి.రాజు, కసబోయిన విజయ్, కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే భూభారతి చట్టం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పక్కన కలెక్టర్ ప్రావీణ్య

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

నడికూడ : భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టం అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ పి.ప్రావీణ్యతో కలిసి మండలంలోని ముస్త్యాలపల్లి, సర్వాపూర్ గ్రామాల్లో భూ భారతి చట్టంపై జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోసం తీసుకొచ్చిన నూతన భూ భారతి చట్టం ద్వారా స్వీకరించిన భూ సమస్య దరఖాస్తులను వెంటనే అధికారులు పరిష్కరించాన్నారు. అన్ని రకాల భూ సమస్యలు పరిష్కరించడమే కాకుండా వారికి భూధార్ కార్డును కూడా ఇవ్వనున్నట్లు చెప్పారు. కొత్త చట్టం ప్రకారం కిందిస్థాయి అధికారుల వద్ద తప్పు జరిగితే పై స్థాయి అధికారులు న్యాయం చేసే అవకాశం ఉందన్నారు. ధరణిలో లేని వెసలుబాట్లు భూభారతిలో ఉన్నాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణిలో అనేకమంది పేద రైతులు ఇబ్బందులకు గురయ్యారని, వేల ఎకరాల భూములు గల్లంతయ్యాయని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ నారాయణ, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ విమల పాల్గొన్నారు.

వైద్యులను సస్పెండ్ చేయాలి

- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

కమలాపూర్ : మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రసవానికి వచ్చిన గర్భిణీ తిరుమలకు ప్రసవానంతరం గేజ్ ప్యాడ్ తీయకుండానే కుట్లేసి నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులు, సిబ్బందిని సస్పెండ్ చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కమలాపూర్‌లో నిర్మించిన 30 పడకల ఆస్పత్రిలో పేదలకు వైద్యం సక్రమంగా అందడం లేదని, కలెక్టర్, ఉన్నతాధికారులు తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నా వైద్యులు, సిబ్బంది తీరు మాత్రం మారడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వీడి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా వేలాది మంది ఇళ్లు లేని నిరుపేదలు ఉంటే ప్రభుత్వం ఊరికో ఐదారుగురికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని, ఇళ్లు లేని ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నకీర్త ఓదెలు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్, భీమదేవరపల్లి మండల కార్యదర్శి ఆదరి రమేష్ పాల్గొన్నారు.

భూదందాలు, సెటిల్‌మెంట్లను అరికట్టాలి

- ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

గీసుకొండ : భూదందాలు, సెటిల్‌మెంట్లను అరికట్టాలని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) రాష్ట్ర చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ పరిధిలోని కేస్టేట్‌లో మంగళవారం నిర్వహించిన కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆజంజాహి మిల్లు భూములు అన్యాక్రాంతం కాకుండా గతంలో పని చేసిన కార్మికుల కుటుంబాలకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గంజాయి, భూదందాల నివారణకు పోలీసులు కఠిన చర్యలు చేపట్టాలన్నారు. కమిటీ జిల్లా చైర్మన్ గంగుల అశోక్ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు రోగుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు లాగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. కార్యక్రమంలో కమిటీ హన్మకొండ జిల్లా చైర్మన్ దుబాసి నవీన్, గ్రేటర్ వరంగల్ చైర్మన్ సరళాదేవి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాల్నె లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కేయూ రిజిస్ట్రార్‌కు సమ్మె నోటీస్

కేయూ క్యాంపస్: దేశవ్యాప్తంగా ఈనెల 20న జరగనున్న సమ్మెలో కాకతీయ యూనివర్సిటీ ఉద్యోగులుగా తాము పాల్గొనబోతున్నామని తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ యూనివర్సిటీ కమిటీ బాధ్యులు తెలిపారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంకు మంగళవారం సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను టైంస్కేల్ ఉద్యోగులుగా మార్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీసం వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ యూనివర్సిటీ అధ్యక్షుడు మెట్టు రవి, బాధ్యులు దేశిని రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో వర్ష బీభత్సం



మామిడి తోటను పరిశీలిస్తున్న అధికారిణి సుస్మిత



తడిసిన ధాన్యం తిరగబోస్తున్న రైతులు

ధర్మసాగర్ : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కుప్పలు పోశారు. మరికొంత మంది ఆరబోయగా రాత్రి వాటిపై టార్పాలిన్లు కప్పారు. ఈ క్రమంలో కురిసిన అకాల వర్షానికి నీరంతా ధాన్యం కుప్పల కిందికి వెళ్లి తడిచాయి. దీంతో మంగళవారం ఉదయం రైతులు తడిచిన ధాన్యం తిరగబోసి ఆరబోశారు. అక్కడక్కడా రోడ్లపై చెట్లు నేలకూలాయి. కొన్ని గ్రామాల్లో పశువుల పాకలు కుప్పకూలాయి. అక్కడక్కడా విద్యుత్ స్తంభాలు విరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఏఈ జోతిర్మయినాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. క్యాతంపల్లి, పెద్దపెండ్యాల, ముప్పారం గ్రామాల్లో ఈదురు గాలులకు చేతికి అందివచ్చిన మామిడి తోటల్లో కాయలు పూర్తిగా రాలి దెబ్బతిన్నాయి. ఉద్యాన అధికారి సుస్మిత తోటలను పరిశీలించి వివరాలు సేకరించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ప్రసన్నాంజనేయ స్వామికి అలంకరణ



హన్మకొండ అర్బన్: నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో స్వామికి మంగళవారం ఉదయం పంచామృత అభిషేకం, చందన సేవ నిర్వహించి అరటి పండ్లతో అలంకరణ చేసి హారతి సమర్పించినట్లు ఆలయ అర్చకులు ఆరుట్ల రామాచార్యులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు భజన కార్యక్రమం నిర్వహించిన అనంతరం మాలధారులకు అన్నదానం (భిక్ష) ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో హనుమాన్ దీక్ష సేవ సమితి అధ్యక్షుడు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, సభ్యులు దశరథ్ కుమార్, మాదాసు మొగులయ్య, గంధ్రతి సుధాకర్, గంట సత్యం, సీతాసమ్మయ్య, శంకర్ పాల్గొన్నారు.